సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 7 । ఏప్రిల్ । 2023



ఆపరేషన్ వికటించి మహిళ మృతి

జెపూరు ప్రభుత్వ ఆస్పత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వికటించి పోలీపుట్టుకు చెందిన మహిళ మృతి చెందింది 8లో



అండగా పోలీసు శాఖ

గిరిజన ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సీఆర్‌పీఎఫ్, పోలీసుశాఖ అధికారులు కోరారు. 8లో



ఐదుగురికి కారుణ్య నియామకాలు

విశాఖ జెడ్పీ కార్యాలయంలో ఐదుగురికి కారుణ్య నియామకాలు అందజేస్తూ చైర్‌పర్సన్ సుభద్ర ఉత్తర్వులు జారీ చేశారు. 8లో



న్యూస్‌రీల్

డీఫారం పట్టాలను రికార్డుల్లో నమోదు చేయండి

- పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



అసైన్డ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

పాడేరు రూరల్ : గిరిజన ప్రాంతాల్లో డి.ఫారం పట్టాలు కలిగి రెవెన్యూ రికార్డుల్లో నమోదు కాకపోవడంతో రైతు భరోసా పొందలేకపోతున్నారని, వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి కోరారు. గురువారం ఆమె విజయవాడలో రెవెన్యూ శాఖ సీసీఎల్‌ఏ ఆధ్వర్యంలో మంత్రి ధర్మన ప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించిన అసైన్డ్ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. గిరిజన ప్రాంతాల్లో గిరిజనులకు ఎదుర్కొంటున్న పలు భూ సమస్యలను కమిటి దృష్టికి తీసుకువెళ్లినట్టు ఆమె తెలిపారు.

మిషన్ వాత్సల్యకు దరఖాస్తుల ఆహ్వానం

చింతూరు: అర్హుల నుంచి మిషన్ వాత్సల్య పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చింతూరు సీడీపీవో విజయగౌరి గురువారం తెలిపారు. 18 ఏళ్లలోపు సంరక్షణ అవసరమైన పిల్లలకు ఆర్థిక, వైద్య, విద్య తదితర అవసరాలు తీర్చేందుకు మిషన్ వాత్సల్య పథకం ఉపయోగపడుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా పిల్లలకు నెలకు రూ. 4 వేలు అందిస్తారన్నారు. వితంతువు, విడాకులు తీసుకున్న పిల్లలు, బాల కార్మికులు, అంగవైకల్యం, తప్పిపోయిన పిల్లలు, అనాధ పిల్లలు, ఆర్థికంగా, శారీరకంగా వెనుకబడిన తల్లిదండ్రుల పిల్లలు ఈ పథకానికి అర్హులని ఆమె వివరించారు. కుటుంబ ఆదాయం ఏడాదికి రూ.72 వేలు మించనివారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.


వైభవంగా వేంకటేశ్వరుని తిరు కల్యాణం



స్వామి వారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ఎటపాక: మండలంలోని నందిగామ గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామి వారి తిరుకల్యాణం వైభవంగా జరిపించారు. ఈసందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆలయం నుంచి అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. ఘనంగా కల్యాణం జరిపించారు.

యువకుడి ఆత్మహత్య



ప్రతాప్‌కుమార్ మొంటీ మృతదేహం

దుంబ్రిగుడ: మండలంలోని కురిడి పంచాయతీ ఆంధ్రా–ఒడిశా సరిహద్దు సమీపంలోని గోరాపూర్ రైల్వే ట్రాక్ వద్ద బుధవారం రాత్రి ఒడిశాకు చెందిన ఓ యువకుడు రైల్వే ట్రాక్‌పై తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు ఆర్‌పీఎఫ్ సీఐ మహేష్, ఏఎస్‌ఐ మోహన్ సంఘటన స్థలానికి మృతదేహాన్ని పరిశీలించారు. అతని వద్ద ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా ఒడిశాలోని పాడువ గ్రామానికి చెందిన ప్రతాప్‌కుమార్ మొంటీ (22)గా నిర్ధారించారు. ఈమేరకు వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. ఇలావుండగా ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ బెట్టింగ్ వల్ల అప్పులు పాలవ్వడంతో ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పాడువ గ్రామస్తులు తెలిపారు.

పల్లె ముంగిటకు ఫ్యామిలీ డాక్టర్





మారేడుమిల్లిలో నూతన 104 అంబులెన్సును ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

- మెరుగైన వైద్యసేవలే లక్ష్యం
- కలెక్టర్ సుమిత్‌కుమార్
- అరకు ఎమ్మెల్యే పాల్గుణ అధ్యక్షతన ప్రారంభం

హుకుంపేట: గ్రామాల్లో మెరుగైన వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని సూకూరు గ్రామ సచివాలయం వద్ద ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణతో కలిసి ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రతీ పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉన్నారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ గ్రామ సచివాలయం పరిధిలో నెలలో రెండు సార్లు వైద్య శిబిరాలు నిర్వహించేలా చర్యలు చేపట్టామన్నారు. బీపీ, షుగర్, ఇతర వ్యాధులతో బాధపడుతున్న రోగులకు, గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. జిల్లాలో 34 అంబులెన్సులు ఉన్నాయన్నారు. చిన్నపిల్లలకు ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు నాటువైద్యులను ఆశ్రయించవద్దని సూచించారు. ప్రతీ పీహెచ్‌సీలోని ఖాళీలను 90 శాతం భర్తీ చేయడమే కాకుండా 10 పడకలు అందుబాటులో ఉన్నాయన్నారు. గర్భిణులు ప్రసవ సమయానికి రెండు వారాలు ముందుగానే ఆస్పత్రిలో చేరాలని సూచించారు. ప్రసవ సమయానికి ఆస్పత్రికి రాకపోవడం వల్ల ఆరోగ్యపరమైన సమస్యలు వస్తాయన్నారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమ ప్రయోజనంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. జిల్లా కేంద్రం పాడేరులో వైద్యకళాశాల నిర్మాణం జరుగుతుందన్నారు. ఇది ప్రారంభమైతే వైద్య నిపుణులు అందుబాటులోకి వస్తారన్నారు.



అంబులెన్సు సేవల వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

ఇంటింటికీ వైద్యసేవలు: అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

ఫ్యామిలీ డాక్టర్ వల్ల ఇంటింటికీ వైద్యసేవలు అందుతాయని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మంచానికి పరిమితమైన రోగులు, వృద్ధులు, వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వారికి ఇంటింటికీ వెళ్లి ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు అందిస్తారన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి వైద్య రంగానికి పెద్ద పీట వేస్తున్నారన్నారు. జిల్లాకు మొట్టమొదటి కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సుమిత్‌కుమార్ గిరిజనులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తూ వారి గుండెల్లో స్థానం సంపాదించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీటీసీవో డాక్టర్ విశ్వేశ్వరనాయుడు, ఎంపీపీ కూడా రాజబాబు, జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం, సర్పంచ్ ధనసాని సత్యవతి, సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, ఎంపీటీసీ కిలగడ సింహాచలమ్మ, 104 జిల్లా మేనేజర్ మురళి, వైద్యాధికారి మోహన్‌సాయి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో వైద్యసేవలు

మారేడుమిల్లి : ఏజెన్సీలో ప్రాంతంలో అందరికీ వైద్య సేవలు అందించడమే ఫ్యామిలీ డాక్టర్ లక్ష్యమని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. గురువారం ఆయన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాగణంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి సంబంధించి రెండు 104 అంబులెన్సులను ఆయన ప్రారంభించారు. గిరి రక్ష బైక్ అంబులెన్స్ ట్రయల్ రన్‌ను పీవో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ పోగ్రాంద్వారా ప్రతి గ్రామంలో ఇంటింటికి వైద్యులతో సహాయ సిబ్బంది వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని వైద్య సేవలు అందిస్తారన్నారు. ఎల్లివాడ, కాకూరు గ్రామాలలో నిర్వహించిన బైకు అంబులెన్స్ ట్రయల్ రన్‌ను పీవో పరిశీలించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో 103 రకాల మందులు, 16 రకాల వైద్య పరీక్షలు చేస్తారన్నారు. ఏడీఎంహెచ్‌వో డాక్టర్ అనూష, వైద్యాధికారులు సుబ్రమణ్యం, శిరీష పాల్గొన్నారు.

ప్రజల వద్దకే వైద్యం

వీఆర్‌పురం: గత ప్రభుత్వ హయాంలో వైద్యం కోసం పేదలు వైద్యుల చుట్టూ తిరిగే వారని ఇప్పుడు ఫ్యామిలీ డాక్టర్ ద్వారా పేదల వద్దకే వైద్యులు వచ్చి సేవలు అందిస్తారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. వీఆర్‌పురం మండలం వడ్డిగూడెం సచివాలయంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను ఆమె రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం ఆమె బీపీ చెకప్ చేయించుకున్నారు. సర్పంచ్ సోడె నరసమ్మ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో పి.పుల్లయ్య, వైద్యాధికారులు సూర్యప్రకాష్, ధనలక్ష్మి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వడ్డిగూడెంలో ఫ్యామిలీ డాక్టర్ అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

పాడేరు ఐటీడీఏ పీవోగా సబ్ కలెక్టర్ అభిషేక్



సాక్షి, పాడేరు: పాడేరు ఐటీడీఏ పీవోగా పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్ నియమితుల య్యారు. ఈయన పాడేరు సబ్ కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఇక్కడి పీవో రోణంకి గోపాలకృష్ణ సర్వే, సెటిల్‌మెంట్స్, ల్యాండ్ రికార్డ్స్ శాఖ అడిషనల్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

మారేడుమిల్లి: లైసెన్స్‌లు లేకుండా ఎవరైనా వాహనాలు నడిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రంపచోడవరం ఆర్టీవో రాజేష్ కుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన గ్రామంలో వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి వ్యక్తి లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. అలాగే ఫిట్నెస్ కలిగిన వాహనాలు మాత్రమే వినియోగించాలని సూచించారు. సరైన రికార్డులు లేకపోతే వాహనాలను సీజ్ చేసి, జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ప్రైవేట్ నెంబర్ కలిగిన వాహనాలను ట్రావెలింగ్‌కు వినియోగిస్తే అటువంటి వాహన యజమానులపై కఠిన చర్యలు తీసుకొని వాహనం సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. మైనర్లు వాహనాలు నడిపితే సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

రంపచోడవరం: ఏజెన్సీలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. రంపచోడవరంలో గురువారం ప్రభుత్వ పాఠశాల, లెనోవా పాఠశాల, గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాల ,బోదులూరు,మారేడుమిల్లిలో పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పది పరీక్షలకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.పరీక్ష కేంద్రంలో ఎన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచాలన్నారు.

మావోయిస్టుల చర్యలతో గిరిజనులకు అన్యాయం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిషోర్

చింతపల్లి రూరల్: మన్యంలో మావోయిస్టు చర్యల కారణంగా గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందకపోగా గిరిజన కుటుంబాలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నాయని చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిషోర్ అన్నారు. గతంలో మావోయిస్టు దాడిలో ప్రాణాలను కోల్పోయిన గెమ్మిల భాస్కరరావు భార్య రంబో (45) గురువారం చింతపల్లిలో అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం కొంత ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలపం ప్రాంతంలో మావోయిస్టులు గతంలో వరుస హత్యలకు పాల్పడటంతో గిరిజనులు భయభ్రాంతులకు గురై ప్రాణ భయంతో స్వగ్రామం వదిలి పలు ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్నారన్నారు. వీరు అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేవలం మావోయిస్టుల చర్యల వల్లే ఏజెన్సీ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. మావోయిస్టు దాడుల్లో నష్టపోయిన గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ పరంగా ఆదుకోవడానికి పోలీసుశాఖ ఎప్పుడూ ముందు ఉంటుందన్నారు. జీకేవీధి సీఐ అశోక్‌కుమార్, అన్నవరం, ఎస్‌ఐలు సాయికుమార్,అప్పలసూరి పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆటిజమ్ దినోత్సవం



సూచనలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: ప్రపంచ ఆటిజమ్ దినోత్సవాన్ని గురువారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు.ఆటిజమ్‌తో బాధపడుతున్న బాలబాలికలు,వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆటిజమ్‌తో బాధపడుతున్న బాలబాలికలతో మాట్లాడారు.వారికి అమలవుతున్న వైద్య ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటిజమ్ బాధితులకు సహాయం జరిగే విధంగా గ్రామ స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. సదరం క్యాంపులను ఏర్పాటు చేసి ఆటిజం బాధితులకు కూడా ధ్రువపత్రాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని, నిరామయ హెల్త్ ఇన్సూరెన్సులో బాధితులను నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, ది ఎబిలిటీ పీపుల్ సంస్థ అధ్యక్షుడు దిలీప్‌పాత్రో, విభిన్న ప్రతిభావంతుల విభాగం జిల్లా ఏడీ శ్రీనివాసరావు, దివ్యాంగుల సంక్షేమశాఖ ఏడీ జె.మాధవి పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్ పరిధిలో సీజీఆర్‌ఎఫ్ సదస్సులు 8లో

కూనవరం పీహెచ్‌సీ ప్రారంభం

శిలాఫలకాన్ని ఆవిష్కరించిన రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



పీహెచ్‌సీ ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

కూనవరం: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి గురువారం ప్రారంభించారు. తాత్కాలిక భవనాల్లో ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో అన్నిగదులను పరిశీలించారు. అనంతరం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కొత్తగా ప్రారంభించిన ఆస్పత్రిలో పూర్తి స్థాయి సేవలు అందుతాయని త్వరలోనే నూతన భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏజెన్సీలో పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందేలా సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. 2019 ఎన్నికలకు ముందు ఈ ప్రాంత ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పీహెచ్‌సీ మంజూరు చేశామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యులు చిచ్చడి మురళి, ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ, ఎంపీటీసీ కొమ్మాని అనంతలక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ ఆవుల మరియాదాస్, మేరుకులం రాష్ట్ర డైరెక్టర్ దీకొండ గంగాధర్, సొసైటీ అధ్యక్షుడు నోముల కొండలరావు, చింతూరు మండల కన్వీనర్ రామలింగారెడ్డి, వైద్యాధికారులు సునీల్, రాజేంద్ర, హెచ్‌వీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో భారీ వర్షాలు

- రహదారులు జలమయం
- మామిడికి తీవ్ర నష్టం



హుకుంపేటలో కురుస్తున్న వర్షం

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో రోజు వర్షాలు కురుస్తున్నాయి. గురువారం మధ్యాహ్నం నుంచి పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. పాడేరుతో పాటు ఘాట్‌లో కుండపోతగా కురిసిన భారీ వర్షంతో వాహన చోదకులు భయాందోళన చెందారు.

రోడ్డుపై కూలిన భారీ వృక్షం

అడ్డతీగల: ఈదురు గాలులకు తిమ్మాపురం ఆర్ అండ్‌బీ రహదారిపై అడ్డంగా చెట్టు కూలింది. దీంతో ఏలేశ్వరం–అడ్డతీగల ప్రధాన రహదారిలో గంటపాటు రాకపోకలు స్తంభించాయి. ఎస్‌ఐ అప్పలరాజు ఆధ్వర్యంలో సిబ్బంది స్థానికుల సహకారంతో చెట్టును తొలగించారు. రాకపోకలు పునరుద్ధరించారు.

హుకుంపేట: మండలంలోని తీగలవలస, మట్టుజోరు, శోభకోట, తడిగిరి, అడ్డుమండ, కొట్నాపల్లి, సూకురు తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రహదారులు జలమయం అయ్యాయి. ఉరుములు మెరుపులతో కూడిన వర్షంతో గిరిజనులు భయాందోళన చెందారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

గూడెంకొత్తవీధి: మండల కేంద్రమైన గూడెంకొత్తవీధిలో గురువారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకూ ఏకధాటిగా సుమారు మూడు గంటలపాటు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వారపుసంతకు వచ్చిన చిరువ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

కొయ్యూరు: మండలంలో సుమారు గంట పాటు ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి.పలు చోట్లమామిడి కాయలు రాలిపోయాయి. గురువారం సాయంత్రం వరకు వాతావరణం బాగానే ఉన్నా తరువాత మార్పు వచ్చింది. కారుమేఘాలు కమ్ముకున్నాయి. ఈదురు గాలులు గంట వరకు వీచాయి. దీంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి.



పాడేరు ఘాట్‌లో కుండపోత వర్షం



తిమ్మాపురం వద్ద కూలిన చెట్టు



రాలిపోయిన మామిడికాయలు

ఆరోగ్యమే మహాభాగ్యం



- మారుతున్న జీవనశైలితో వ్యాధులు
- రోజూ వ్యాయామంతో రోగాలు దూరం

నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

మహారాణిపేట: ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. పూర్వ కాలంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అనేక విధానాలను పాటించే వారు. ప్రతి ఆచారం వెనుక ఆరోగ్యదాయక క్రియ దాగి ఉండేది. తాత, ముత్తాతల నుంచి వస్తున్న సంప్రదాయ పద్ధతులు క్రమంగా కనుమరుగవుతున్నాయి. మారుతున్న ఆహారపు అలవాట్లు.. శారీరక శ్రమ లేకపోవడం.. పని ఒత్తిడి.. వెరసి చిన్న వయసులోనే రోగాల బారిన పడుతున్నాం. మూడు పదుల వయసులోనే మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులు చుట్టుముట్టడంతో గుండె, కిడ్నీ, లివర్, కంటి సంబంధిత వ్యాధులు వస్తున్నాయి. దీనికి తోడు కోవిడ్ 19 వంటి మహమ్మారులు దాడి చేస్తున్నాయి. ఇలాంటి తరుణంలో ఆరోగ్యకర జీవన విధానంపై అవగాహన అవసరం ఏర్పడింది. కోవిడ్ తర్వాత ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా ఏప్రిల్ 7వ తేదీన ప్రపంచ ఆరోగ్య దినోత్సవంగా జరుపుకోవాలని పిలుపునిచ్చింది. అందులో భాగంగానే ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. ఈ సంవత్సరం 'అందరికీ ఆరోగ్యం' అనే ఇతివృత్తంతో 75 వసంతాల ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

మన ఆరోగ్యం.. మన చేతుల్లోనే..

మన ఆరోగ్యం.. మన బాధ్యత. మన ఆరోగ్యాన్ని రక్షించడం కోసం ఎవరో వచ్చి.. ఏదో చేయరు. ఆరోగ్య సంరక్షణలో కీలకమైంది మన జీవనశైలి. పౌష్టికాహారం, బరువు అదుపు, క్రమం తప్పని వ్యాయామం, మానసిక ప్రశాంతత ఉంటే చాలు మన ఆరోగ్యం మన చేతుల్లో ఉన్నట్లే. డబ్బున్నా లేకున్నా, ఎవరైనా.. ఎక్కడైనా మంచి జీవనశైలితో సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చు. జబ్బుల బారిన పడకుండా హాయిగా, ఆనందంగా జీవించొచ్చు. ఇటీవల కాలంలో మళ్లీ కొవిడ్ కేసులు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో స్వీయ నియంత్రణ అవసరం.

వ్యాయామంతో మేలు

నేటి పోటీ ప్రపంచంలో ఉరుకులు, పరుగులతో దినచర్య ప్రారంభమవుతోంది. ఉద్యోగం, వ్యాపారం, ఇతర వ్యాపకాల దృష్ట్యా రాత్రి ఇంటికి ఆలస్యంగా చేరుతున్న వాళ్లే అధికం. కొందరు మిత్రులతో పార్టీలంటూ అర్ధరాత్రి వరకు నిద్రపోవడం లేదు. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. వేకువ జామున నిద్ర లేచి కొంత సమయం నడవడం శ్రేయస్కరం. చిన్నతనం నుంచి పిల్లలను ఉదయాన్నే నిద్ర లేపి వ్యాయామం, ధ్యానం చేయించడం అలవాటు చేయాలి. క్రమం తప్పకుండా చేయిస్తే మంచి ఫలితాలు ఉంటాయి.

వైద్యారోగ్యానికి ప్రాధాన్యం

పటిష్టమైన విద్య, వైద్య రంగాలు అభివృద్ధికి మూల స్తంభాలు. ప్రజల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం.. ఈ దిశగా ప్రజలందరికీ నాణ్యమైన సత్వర వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. వైద్యులు, సిబ్బంది పోస్టులు ఖాళీలు లేకుండా ఎప్పటికప్పుడు భర్తీ చేస్తోంది. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని పటిష్టంగా అమలు చేస్తోంది. 3,255 వ్యాధులకు చికిత్స అందిస్తూ రోగులకు అండగా నిలుస్తోంది. కొత్తగా వైద్య కళాశాలలు నిర్మిస్తోంది. దేశంలోనే వినూత్నంగా ఫ్యామిలీ డాక్టర్ విధానానికి శ్రీకారం చుట్టింది. ఇలా ఎన్నో పథకాలను అమలు చేస్తూ.. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

హెల్త్ చెకప్ తప్పనిసరి



వైద్య, ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. పేదలకు వైద్య సేవలందించడంలో ముందుంది. ప్రతి ఒక్కరూ ఆహార నియామలు పాటించాలి. కొన్ని అలవాట్లకు దూరంగా ఉండాలి. వయసు పైబడిన వారు రెగ్యులర్‌గా హెల్త్ చెకప్ చేసుకోవాలి.

– డాక్టర్ రాధాకృష్ణ, డిప్యూటీ సూపరింటెండెంట్, కేజీహెచ్

ఈపీడీసీఎల్ పరిధిలో సీజీఆర్ఎఫ్ సదస్సులు

వివరాలు వెల్లడించిన సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ



దొండపర్తి (విశాఖ దక్షిణ): ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు సర్కిళ్లలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సదస్సులు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్మన్, విశ్రాంత జడ్జి బి.సత్యనారాయణ వెల్లడించారు. ఈ నెల 10న విశాఖపట్నం జోన్–3లోను, 13న శ్రీకాకుళం జిల్లా పలాస సబ్ డివిజన్‌లోను, 18న విజయనగరం జిల్లా గజపతినగరం సబ్ డివిజన్‌లోను, 27న రాజమహేంద్రవరం కోరుకొండ సబ్ డివిజన్‌లోను, 28న ఏలూరులో గోపాలపురం సబ్ డివిజన్ కార్యాలయంలో సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే సదస్సుల్లో వినియోగదారులు నేరుగా పాల్గొని విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరుమార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి, తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై సీజీఆర్ఎఫ్ కమిటీకి ఫిర్యాదులు చేయవచ్చని సూచించారు. అదే విధంగా సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న సీజీఆర్ఎఫ్ కార్యాలయానికి వచ్చి లిఖిత పూర్వకంగా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వినియోగదారుల సమస్యల వివరాలను పరిశీలించి, విచారణ జరిపి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సదస్సుల్లో సీజీఆర్ఎఫ్ కమిటీ సభ్యులు ఎస్.హరిబాబు, పి.శ్రీనివాస్, డా. రాయసం సురేంద్రకుమార్ కూడా పాల్గొంటారని తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



భర్తతో మృతురాలు సూర్యకుమారి

రంపచోడవరం : అత్తింటి వేధింపులతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన రంపచోడవరంలో ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానిక ఎర్రంరెడ్డి నగర్‌లో నివాసం ఉంటున్న రోలుపల్లి వెంకటసూర్యకుమారి(26) భర్త, అత్త, మామ, ఆడపుచుల వేధింపులు భరించలేక బుధవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకొంది. ఘటనపై మృతురాలి సోదరుడు గాంధీరెడ్డి రంపచోడవరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గంగవరం మండలం గొరగొమ్మి గ్రామానికి చెందిన సూర్యకుమారికి రంపచోడవరం ఎర్రంరెడ్డి నగర్‌కు చెందిన రోలుపల్లి సాయిరామకృష్ణారెడ్డితో వివాహమైంది. అయితే భర్తతో పాటు అత్త శ్రీలత, ఆడపడుచు శ్రీదుర్గ, మావయ్య భాస్కరరావులు కట్నం కోసం వేధిస్తున్నట్టు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. నిత్యం వేధింపులకు గురి చేస్తున్నారంటూ తమకు ఫోన్ ద్వారా తన చెల్లెలు చెప్పేదని సోదరుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ సంఘటనపై భర్త, అత్త,మామ, ఆడపడుచులను అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ మోహన్‌కుమార్ తెలిపారు. మృతురాలు ఆత్మహత్యకు పాల్పడిందా, లేదా భర్త ప్రమేయం ఉందా అనే దానిపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు తెలిపారు. రంపచోడవరం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టమ్ నిర్వహించారు.

ఐదుగురికి కారుణ్య నియామకాలు

మహారాణిపేట : జిల్లా పరిషత్ కార్యాలయంలో ఐదుగురికి కారుణ్య నియామకాలు అందజేస్తూ చైర్‌పర్సన్ జె. సుభద్ర ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ కరోనా కష్ట కాలంలో తల్లిదండ్రులను పోగొట్టుకొని కుటుంబానికి ఎటువంటి ఆసరా లేక ఇబ్బంది పడుతున్న వారి కోసం నియామకాలు చేపట్టామన్నారు. జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామ్మూర్తి తాను ఇచ్చిన ఆదేశాల మేరకు తక్కువ సమయంలో కారుణ్య నియామకాల ప్రక్రియను పూర్తి చేసి సహకరించారని చైర్‌పర్సన్ కొనియాడారు. ఉద్యోగాలు పొందిన వారితో చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానం ప్రకారం ఉద్యోగాలు కల్పించామన్నారు. వృత్తి పట్ల అంకితభావంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామ్మూర్తి, డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

భారీగా గంజాయి స్వాధీనం!

మారేడుమిల్లి : కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని మారేడుమిల్లి పోలీసులు పట్టుకున్నట్టు సమాచారం వారినుంచి సుమారు 50 కేజీల గంజాయిని పట్టుకుని, నగదును కూడా స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. గంజాయిని తరలిస్తున్న ఒకరిని అరెస్ట్ చేసినట్టు సమాచారం. ఇందులో పలువురు పరారీలో ఉండగా, వారి కోసం పోలీసులు గాలిస్తున్నట్టు సమాచారం. అయితే దీనిపై ఎటువంటి వివరాలను పోలీసులు వెల్లడించలేదు.

ఆపరేషన్ వికటించి మహిళ మృతి

- జైపూర్‌లోని ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన

ముంచంగిపుట్టు: ఒడిశాలోని జైపూరు ప్రభుత్వ ఆస్పత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వికటించి మండలంలోని జోలాపుట్టుకు చెందిన బొడ్నాయక్ రామరాజు భార్య సూర్యతేజ (35) మృతి చెందింది. దీంతో ఆమె బంధువులు, కుటుంబ సభ్యులు ఆక్కడి ఆస్పత్రి ఎదుట గురువారం రాత్రి ఆందోళన చేశారు. ఈ విషయం తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆస్పత్రి వర్గాలతో మాట్లాడారు. న్యాయం జరిగేలా చూస్తామని బాధిత కుటుంబానికి హామీ ఇచ్చారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను కోరారు. మృతదేహం స్వగ్రామం జోలాపుట్టుకు తీసుకువచ్చేందుకు ఆయన అంబులెన్సు ఏర్పాటుచేశారు.

అండగా పోలీసు శాఖ

జి.మాడుగుల: గిరిజన ప్రాంతాల్లో సీఆర్‌పీఎఫ్, పోలీస్‌శాఖ అందిస్తున్న సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సీఆర్‌పీఎఫ్ 198బిఎన్ 'ఎ' ఓసీ కెసీ రాజా, సీఐ సత్యనారాయణ,ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. జి.మాడుగుల సీఆర్‌పీఎఫ్, పోలీస్‌శాఖ అధ్వర్యంలో గురువారం మండలంలో గల బూసుపల్లి, ఈదులబయలు, జోగులపుట్టు, జి.మాడుగుల తదితర గ్రామాలకు చెందిన 500మందికి దోమ తెరలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ గిరిజన ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని దోమ కాటు నుండి రక్షణ నిమిత్తం దోమ తెరలు అందించినట్టు వారు అన్నారు. ఆరోగ్య నియమాలను పాటించి ప్రజలందరు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని వారు సూచించారు. గిరిజన ప్రాంతాల్లో పోలీస్‌శాఖ, సీఆర్‌పీఎఫ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు వినయోగించుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది, మహిళా పోలీస్‌లు, వలంటీర్లు, పలు గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

Acute Myocardial Infarction in Young Individuals

Coronary artery disease (CAD) is an emerging health problem in India; various risk factors contribute to the increased prevalence of CAD in different age groups. Cardiovascular diseases (CVDs) and its complications account for approximately 12 million deaths annually in the Indian subcontinent. As per 2014 statistics by the World Health Organization, 26% of total mortality in India is contributed by CVD. Mortality due to CAD is higher in South India. The mean age for the first presentation of acute myocardial infarction (MI) in Indians is 53 years.

Studies carried out in India, and other places suggest that Asians in general and Indians in particular are at an increased risk of MI at a younger age (<40 years).[4] Heart diseases are rising in Asian Indians and present 5–10 years earlier than in other populations around the world.

Certain risk factors such as family history, obesity, dyslipidemia, and use of tobacco products, are more potent predictors of outcomes in the young than in their older counterparts. Family history of Premature CAD is an important risk factor for young CAD. It stresses the role of genes in the etiology of young CAD. Studies have shown that person with positive family history of PCAD tends to have severe coronary atherosclerosis and is a very strong predictor of future acute coronary event.

Tobacco smoking is an important independent risk factor for CAD in young adults. The risk of CAD begins to decline within months of smoking cessation and disappears within 3–5 years. A few studies have estimated smoking prevalence at 28.5%–30% in Indians living in India. Current smoking of >10 cigarettes or beedi a day is associated with a 6.7-fold increase in the risk of MI.

Indians are genetically prone to develop type-2 diabetes mellitus due to insulin resistance. Hyper insulinemia in these patients accelerates the atherosclerotic process in the coronary arteries. Diabetes is second only to CAD as a health burden in India. During the past decade, the number of people with diabetes in India increased from 32 million to 50 million, and this figure may reach 87 million by 2030. Hyperinsulinemia, insulin resistance, and higher rate of prevalence of metabolic syndrome in people with type-2 diabetes were attributed to high risk for MI in South Asians.

Dyslipidemia is defined as total cholesterol (TC) >200 mg/dl, low-density lipoprotein (LDL) >100 mg/dl, triglycerides (TG) >150 mg/dl, high-density lipoprotein (HDL) <40 mg/dl, according to the NCEP-ATP3 guidelines.[39] An elevated level of TC is the strongest risk factor for CAD. Obesity is a well-established risk factor for CAD, particularly in urban India.

Prevention and control of premature cardiovascular diseases in India need urgent control of these factors. Smoking turned out to be the major risk factor which needs strict prevention. Target oriented control of hypertension, obesity, lipid levels, and glycemia are required. An usual physical activity of 30 mins per day of moderate physical activity for 5 days a week is recommended along with target oriented control of risk factors.

Dr. Chakradhar Pedada
MBBS, MD, DM
Consultant Cardiologist
APOLLO HOSPITALS
Health City, Visakhapatnam

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



పోలీసులు అరెస్టు చేసిన రూపేష్‌కుమార్

చింతపల్లి: గూడెంకొత్తవీధి మండలంలోని పెదవలస పంచాయతీ చాపరాతిపాలెంలో ఇటీవల జరిగిన హత్య కేసుకు సంబంధించి నిందితుడు రూపేష్‌కుమార్‌ను అరెస్ట్ చేశామని అదనపు ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ గురువారం తెలిపారు. ఈ నెల 3వ తేదీన వరుసకు అన్నయ్య అయిన సంతోష్‌కుమార్‌ను లావాదేవీల విషయంలో గొడవ పడి గొడ్డలితో నరికి హత్య చేసిన సంగతి తెలిసిందే. ఘటనపై జీకేవీధి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఉత్తరప్రదేశ్ నుంచి ఎయిర్‌టెల్ టవర్ నిర్మాణ పనులకు సంబంధించి 11 మంది కార్మికులు ఈ ప్రాంతానికి వచ్చారని వివిధ గ్రామాల్లో పనులు నిర్వహిస్తున్న వీరు గత నెల 26 న చాపరాతి పాలెం చేరుకున్నారన్నారు. ఈ నెల 2న నగదు విషయంలో రూపేష్‌కుమార్‌కు సంతోష్‌కుమార్‌కు మధ్య వివాదం జరగడంతో సంతోష్‌కుమార్‌ను రూపేష్‌కుమార్ గొడ్డలితో నరికి హత్య చేశాడని అదనపు ఎస్పీ తెలిపారు. అనంతరం ఉత్తరప్రదేశ్ పారిపోయేందుకు పెదవలస వద్ద వేచి వున్న నిందితుడిని పట్టుకున్నామన్నారు. అతని వద్ద హత్యకు ఉపయోగించిన గొడ్డలిని స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో జీకేవీధి సీఐ అశోక్ కుమార్, ఎస్ఐ అప్పల సూరి పాల్గొన్నారు.

ఆసరాతో పేదల జీవితాల్లో వెలుగులు

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



కార్యక్రమానికి హాజరైన మహిళలు

వీఆర్ పురం: రేఖపల్లి వెలుగు కార్యాలయంలో గురువారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వైఎస్సార్ ఆసరాతో పేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయన్నారు. మండల వ్యాప్తంగా 197 స్వయం సహాయక సంఘాలకు గాను 2000 వేల మంది సభ్యులకు మూడో విడతగా రూ 70.83లక్షల అందజేయడం హర్షణీయమన్నారు. ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమానికి వేలాదిగా మహిళలు రావడం చాలా అనందంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కేజీవీబి విద్యార్థినుల ప్రదర్శన ఆకట్టుకుంది. రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు మురళి, వెలుగు ఏపీఎం కిషోర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగులు, వైఎస్ ఎంపీపీ గంగాభవాని ,ఎంపీటీసీ సభ్యులు విజయలక్ష్మి ,సర్పంచ్‌లు రామారావు, శారద, బాలరాజు, పార్టీ మండల కన్వీనర్ గోపాల్, నాయకులు మురళి తదితరులు పాల్గొన్నారు.